క్లుప్తంగా

సెల్‌ఫోన్లు రికవరీ.. అందజేత



బాధితులతో ఏసీపీ సతీశ్, సిబ్బంది

హుస్నాబాద్/గజ్వేల్‌రూరల్/సిద్దిపేటకమాన్: రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లను ఏసీపీలు మంగళవారం ఆయా బాధితులకు అందజేశారు. హుస్నాబాద్ డివిజన్ పరిధిలో దొంగలించబడిన 11 సెల్ ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీతో రికవరీ చేసి బాధితులకు ఏసీపీ సతీశ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నా.. ఎవరైనా దొంగలించిన వెంటనే సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)లో డేటా నమోదు చేసినట్లయితే ఫోన్ రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేశ్ పాల్గొన్నారు. అలాగే గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి 45 మందికి రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లను అప్పగించారు. కార్యక్రమంలో గజ్వేల్ సీఐ సైదా, రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, తొగుట సీఐ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట ఏసీపీ మధు 40 మంది బధితులకు రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లను అప్పగించారు.

తహసీల్దార్‌గా నిర్మల



జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ తహసీల్దార్‌గా నిర్మల మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు ఇక్కడ విధులు నిర్వహించిన కృష్ణమోహన్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నిర్మల ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలుంటే ప్రజలు స్వయంగా తమదృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు సేవలు అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. మండలంలోని గొల్లపల్లిలో బుధవారం నిర్వహించనున్న భూభారతిపై అవగాహన సదస్సుకు కలెక్టర్ రానున్నట్లు తెలిపారు.

వేసవి శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న సాదత్ అలీ

చిన్నకోడూరు(సిద్దిపేట): వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు సాదత్ అలీ, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. వివిధ రకాల ప్రయోగాలను విద్యార్థులకు వివరించారు. చదువుతో పాటు క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు, ఉపాధ్యక్షుడు అజీజ్, వెంకటేశం, మనోజ ఉన్నారు.

విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులు రజిత, అంజలి, నిఖిత

నంగునూరు(సిద్దిపేట): ఎమ్ఎస్ఎన్ ఫార్మా కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌కు ముగ్గురు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులైన రజిత, అంజలి, నిఖిత ప్రతిభ కనబర్చారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా డిగ్రీ ఎడ్యుకేషన్, హాస్టల్ వసతి కల్పించి నెలకు రూ.15 వేలు అందజేస్తారని చెప్పారు. గతేడాది కళాశాల నుంచి 20 మంది విద్యా ర్థులు ఎంపికై ఫార్మా కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు దేవయ్య, ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులతో కలిసి ఆయన అభినందించారు.

వ్యర్థజలాలు వదలొద్దు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని నర్సింహులపల్లె శివారులోని ఇథనాల్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థ జలాలను ముత్తన్నపేట సాగునీటి కాలువలోకి వదలొద్దని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. ముత్తన్నపేట శివారులోని సాగునీటి కాలువను మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. వ్యర్థాలు వదలడమే కాకుండా కంపెనీ సిబ్బంది స్థానిక కూలీలపై దురుసుగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు లక్ష్మణ్, తిరుపతి, రాజయ్య, రాజేశం, తిరుపతి, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. అదేవిధంగా సాగునీటి కాలువను ధ్వంసం చేసి ఇథనాల్ కంపెనీపై చర్య తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సాయికృష్ణ, ఎల్లయ్య పాల్గొన్నారు.

విగ్రహాలు.. ఆగ్రహాలు

- అనుమతి లేకుండా ఏర్పాట్లు
- పోటాపోటీగా వివిధ సామాజిక వర్గాలు
- నివురుగప్పిన నిప్పులా పరిస్థితులు
- పట్టించుకోని అధికారులు



పాత బస్టాండ్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న రజక సంఘం నాయకులు

దేశం కోసం, సమాజం కోసం మంచి పనులు చేసిన మహనీయులను స్మరించుకోవడం కోసం విగ్రహాలను ఏర్పాటు చేసుకొంటాం. వారి ఆశయాలను కొనసాగించడానికి ప్రేరణగా ఆ ప్రతిరూపాలను రూపొందించుకొంటాం. కాని ఇప్పుడు విగ్రహాల ఏర్పాటు చుట్టూ కుల రాజకీయాలు అలముకొంటున్నాయి. గొడవలకు దారితీస్తున్నాయి.

కోహెడ(హుస్నాబాద్): కోహెడలోని పలు ప్రధాన కూడళ్లలో తమ ఇష్టానుసారం విగ్రహాల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు పోటీలు పడి భూమిపూజలు, నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హుస్నాబాద్ రోడ్డు మల్లన్న ఆలయం, పాత బస్టాండ్ చౌరస్తాల వద్ద, అలాగే కరీంనగర్ రోడ్డు హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ వద్ద పలువురు మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు పోటాపోటీగా భూమి పూజలు జరిగాయి.

కులాల ప్రాతిపదికగా..

హుస్నాబాద్ రోడ్డు మల్లన్న ఆలయం చౌరస్తా(సమీకృత మార్కెట్) వద్ద ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహ ఏర్పాటుకు ఇటీవల పద్మశాలి సామాజిక వర్గం భూమిపూజ నిర్వహించింది. అయితే బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు అక్కడే గతంలోనే అక్కడ భూమిపూజ చేసినట్లు ఎస్సీ సామాజిక వర్గం నుంచి వ్యతిరేకత వస్తోంది. అదేవిధంగా పాత బస్టాండ్ వద్ద ఇటీవల చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు రజక సామాజిక వర్గం ప్రతినిధులు భూమిపూజ చేశారు. అయితే అక్కడ ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు గతంలో భూమిపూజ చేశామని ఆ స్థలంలో తామే విగ్రహం ఏర్పాటు చేస్తామని పలువురు హిందువాదులు షోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారని ప్రచారం. అదే విధంగా కరీంనగర్ రోడ్డు హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ చౌరస్తా వద్ద రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు నిజాం పరిపాలనలో పోలీస్ అధికారి(కొత్వాల్)గా పనిచేసిన వెంకటరామారెడ్డి విగ్రహ నిర్మాణానికి నెల రోజుల క్రితమే పనులు ప్రారంభించారు. ఎవరికి వారు చౌరస్తా వద్ద విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజలు చేశారు. కాని ఎవరూ కూడా కలెక్టర్, ఆర్అండ్‌బీ, జీపీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి పొందలేదు. ఈ నేపథ్యంలో కులాలు, వర్గాల మధ్య ఎప్పుడు ఏ ఘర్షణలు తలెత్తుతాయోనని స్థానికుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.

అందుకేనా..

కురుమ సంఘం ఆధ్వర్యంలో కురుమవాడలోని వింజపల్లి చౌరస్తా వద్ద నిర్మించిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గత 23న ఆవిష్కరించారు. ఈ క్రమంలో కుల ప్రాతిపదికన విగ్రహాలకు భూమిపూజలు చేయడం ఊపందుకొన్నాయని స్థానికులు చెప్తున్నారు.

అధికారుల నిర్లక్ష్య వైఖరి

ఎవరికి వారే విగ్రహాల ఏర్పాటుకు పోటీ పడుతున్న నేపథ్యంలో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు వైఫల్యం ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనుమతి తప్పనిసరి



గ్రామంలో చౌరస్తాల వద్ద విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్, ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతి లేకుండా నిర్మాణ పనులు చెపటితే చర్యలు తీసుకుంటాం. అలాంటి వారికి నోటీసులు జారీ చేస్తాం.

– నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, కోహెడ

దాహం తీరుస్తాం..

- నాలుగు రోజుల్లో ట్యాంక్‌కు కనెక్షన్
- మిషన్ భగీరథ ఎస్ఈ వెంకట్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..



భగీరథ వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకట్‌రెడ్డి తదితరులు

అక్కన్నపేట(హుస్నాబాద్): నందారం క్రాసింగ్ వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కాలనీని మంగళవారం మిషన్ భగీరథ ఎస్ఈ వెంకట్‌రెడ్డి సందర్శించారు. నాలుగైదు రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి పునరావాస కాలనీవాసులకు ఇంటింటికీ భగీరథ తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. 'గుక్కెడు నీరివ్వండి' పునరావాస కాలనీవాసుల గోస.. 'గౌరవెల్లికి భూములిచ్చి సర్వస్వం కోల్పోయి..' అనే శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి స్పందించారు. వెంటనే పునరావాస కాలనీని సందర్శించి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో మిషన్ భగీరథ ఎస్ఈ పి.వెంకట్‌రెడ్డి ఈఈ గిరిధర్, సిబ్బందితో కలిసి కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌటకుంట తండా సమీపంలో ఇటీవల నిర్మించిన సంపు ద్వారానే పునరావాస కాలనీలో నిర్మించిన భగీరథ ట్యాంక్‌కు నీళ్ల సరఫరా చేస్తామన్నారు. అయితే సంపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ లేక సరఫరాలో జాప్యం జరిగిందని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కలెక్టర్ నిధులను మంజూరు చేస్తామన్నారని, నాలుగైదు రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి కాలనీలో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. ఆయన వెంట డీఈలు శ్రీనివాస్, రుబినా తస్కిన్, ఏఈ సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆర్డీఓ రామ్మూర్తి



మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్: స్థానిక రేణుకా ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ రామ్మూర్తి అధికారలను ఆదేశించారు. ఆలయ ఆవరణలో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 నుంచి జూన్ 16 వరకు జరగనున్న ఈ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయాలని, పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ట్రాన్స్‌కో ఈఏ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ మహేశ్, ఆలయ నిర్వహణాధికారి కిషన్‌రావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూట్‌మ్యాప్ మార్పునకు గ్రీన్‌సిగ్నల్

- ఎంపీ రఘునందన్‌రావు చొరవ వల్లే..
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సూర్యాపేట–సిరిసిల్లను కలుపుతూ రూపొందించిన 365బీ జాతీయ రహదారి రూట్‌మేప్ మార్పునకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్ మంగళవారం తెలిపారు. ఈ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు ఎంపీ రఘునందన్‌రావుకు విన్నవించగా, ఆయన చొరవ తీసుకుని ఆ రైతులను మంగళవారం ఢిల్లీ తీసుకువెళ్లారని చెప్పారు. దీనిపై జాతీయ రహదారులశాఖ కార్యదర్శి ఉమాశంకర్‌కు ఎంపీ రైతులతో కలిసి వినతిపత్రం సమర్పించినట్టు చెప్పారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు, కాలువల నిర్మాణాల కోసం భూములు కోల్పోయిన రైతుల గురించి రహదారులశాఖ కార్యదర్శికి వివరించారని, దీంతో ఆయన స్పందించి కొత్తగా ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను ఎంపిక చేస్తామని తెలిపినట్టు చెప్పారు. నాయకులు సంతోష్, రైతులు రాంరెడ్డి, నర్సింహులు, సందీప్‌రావు, తిరుపతి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే రాజీవ్ యువ వికాస పథకం

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



బ్యాంక్ మేనేజర్లతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: అర్హులైన వారికే రాజీవ్ యువ వికాస పథకాన్ని వర్తింపజేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన వివిధ బ్యాంకుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రాజీవ్ యువ వికాస పథకం విధివిధానాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఈ పథకంలో భాగంగా వివిధ యూనిట్లకు 1,690 మంది దరఖాస్తు చేసుకొన్నారన్నారు. నిరుద్యోగ యువత ఉపాధికి రాయితీలపై రుణ సదుపాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీజీవీ మేనేజర్ సందీప్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' ఎంపికపై గ్రామస్తుల ఆగ్రహం

అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలని డిమాండ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీఓ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లింగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఆవరణలో మంగళవారం ఇందిర్మ ఇళ్ల జాబితాను ప్రదర్శించారు. అందులో అనర్హుల పేర్లు ఉండటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజు, ఎంపీఓ వెంకటేశ్వర్లును నిలదీశారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు అందని ద్రాక్షగా మారిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పారదర్శకంగా సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. ఎంపీఓ వెంకటేశ్వర్లును వివరణ కోరాగా ఉన్నతాధికారుల నుంచి వచ్చిన జాబితా ప్రకారం సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు.

పారదర్శకం.. భూభారతి చట్టం

- జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారం
- కలెక్టర్ మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం అత్యంత పారదర్శకంగా అమలవుతుందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. స్థానిక ఓ పంక్షన్‌హాల్లో మంగళవారం భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేధావులు, ప్రజలు, రైతులతో చర్చించి వారి అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వం గత 14న నూతనంగా భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చిందని చెప్పారు. నిర్ణీత కాలంలో సమస్యను పరిష్కరించే విధంగా చట్టాన్ని రూపొందించారని చెప్పారు. ఆధార్‌కార్డు లాగానే పూర్తి వివరాలతో కూడిన భూధార్ కార్డును రైతులకు అందించనున్నట్టు తెలిపారు. దీంతో భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చన్నారు. రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలోను పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని చెప్పారు. అదే విధంగా జీపీఎస్ సిస్టం ద్వారా భూ సరిహద్దుల సమస్యలు పరిష్కరిస్తామని, అధికారులు అందించిన ఆర్డర్లపై అప్పీల్ చేసకునే అవకాశం ఉంటుందని వివరించారు. రెవెన్యూ డివిజన్ అధికారిపై కలెక్టర్‌కు, కలెక్టర్ పై ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకొనే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరి మర్రిముచ్చాల ధాన్యం కొను గోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, పీఏసీఎస్ మెరుగు కృష్ణ, తహసీల్దార్ దివ్య, ఎంపీడీఓ శ్రీనివాస వర్మ, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడి.. సౌకర్యాల ఒడి



చేర్యాల(సిద్దిపేట): తల్లిదండ్రులకు కరపత్రం అందజేస్తున్న భాస్కర్, ఎంఈఓ కిష్టయ్య తదితరులు

చేర్యాల(సిద్దిపేట): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ఉచిత సౌకర్యాలను పొందాలని జిల్లా సెక్టోరియల్ అధికారి బేతి భాస్కర్ సూచించారు. మండల పరిధిలోని ఆకునూరు, కాశగుడిసెలులో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు.

జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్

ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని, ఉచితంగా యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందజేస్తారాని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ కిష్టయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఐలయ్య, హెచ్‌ఎంలు అయోధ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రభాకర్, కృష్ణమూర్తి, రవీందర్, సంతోష్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, శ్యాంసుందర్, రాజయ్య, సమ్మయ్య, శ్రావణ్‌కుమార్, నరేశ్, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

రామంచలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి చిన్నారుల వివరాలు సేకరించి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు సురేశ్‌కుమార్, వరప్రసాద్, లలిత, సునీత, నాగమణి, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపుల స్వాధీనం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి శివారులో రెండు ఇసుక డంపులను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. నమ్మదగిన సమాచరం మేరకు గ్రామ శివారులో తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన 95 టన్నుల ఇసుకను గుర్తించామని, ఎలాంటి అనుమతులు లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించామని ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు.

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.11వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

శత చండీయాగానికి పీఠాధిపతి



యాగంలో పాల్గొన్న మాధవానంద

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరులో అనఘా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న శత చండీ యాగం కార్యక్రమానికి మంగళవారం తొగుట ఆశ్రమ పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి స్వామి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానవ జీవితంలో ఒక దశ దిశను చూపిస్తాయన్నారు. 500 సుహాసినీలతో కుంకుమార్చన నిర్వహించారు. దేశపతి లలితామతి శర్మ, జగన్మోహన్‌శర్మ, రాంప్రసాద్‌శర్మ, మృత్యుంజయశర్మ తదితరులు పాల్గొ న్నారు.

సంక్షిప్త వార్తలు

◆ హెచ్‌ఎంపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

హుస్నాబాద్‌రూరల్: మీర్జాపూర్ పాఠశాల హెచ్‌ఎం వేణుకుమార్‌పై కక్షగట్టి ఓ సంఘం నేత సస్పెండ్ చేయించారని, దానిని ఎత్తివేసి ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. డీటీఎఫ్ సంఘం నాయకులు కావాలనే ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులు శంకర్ నాయక్, సమ్మయ్య, వెంకటయ్య, మోహన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

◆ సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ములుగు(గజ్వేల్): ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను అధికారులు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు డీఆర్‌డీఓ బాలకృష్ణ, ఏపీడీ శివాజీ, అంబుడ్స్‌మెన్ ఖాజా ఆరిఫ్ అలీ హాజరయ్యారు. 26 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన వివిధ పనులపై ప్రజావేదికలో నివేదికలను చదివి వినిపించారు. 13 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ సిబ్బంది రికార్డుల తప్పిదాల వల్ల రూ.21లక్షలు, 12 గ్రామ పంచాయతీల్లో కూలీలకు అధికంగా డబ్బులు చెల్లించడం వల్ల రూ.31 లక్ష 62 వేలను రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వర్ణకుమారి, ఏపీఓ లక్ష్మి, సూపరింటెండెంట్ రామచంద్రం, ఈసీ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ దుర్గయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు బైతిదుర్గయ్యను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు వసుంధర విజ్ఞాన వికాస మండలి గోదావరిఖని సంస్థ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. చిన్నకోడూరు మండలం అనంతసాగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న దుర్గయ్య రెండు దశాబ్దాలుగా విద్యార్థుల ఉన్నతి కోసం విశేష సేవలు అందించడంతో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశామని సంస్థ నిర్వాహకులు తెలిపారు.

◆ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఏఐసీసీ నాయకుడు విశ్వనాథన్ సూచించారు. కరీంనగర్ వెళ్తూ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హరికృష్ణ, అత్తు ఇమామ్, యాదగిరి, కలీమొద్దీన్, ఎల్లంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ గ్రామసభల ద్వారానే ఎంపిక చేయండి

కొమురవెల్లి(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభల ద్వారనే ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మండల కార్యదర్శి తాడూరి రవీందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తే అవినీతి జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, శారద, సాయిలు, మల్లేశం, బాలకిషన్, ఎల్లయ్య, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

◆ దివ్యాంగులకు విద్యార్థిని సహాయం

చేర్యాల(సిద్దిపేట): శబాష్‌గూడెంకు చెందిన విద్యార్థిని భీమనపల్లి సింధు తన పుట్టిన రోజును పురస్కరించుకుని మానసిక వికలాంగులకు చేయూత అందించింది. శ్రీనగర్ కాలనీకి చెందిన దివ్యాంగుడు ముప్వ కిరణ్, వేచరేణి శివారు కాలనీ ఎల్లదాస్‌నగర్‌కు చెందిన మరో దివ్యాంగుడు ఉగ్ర శంకర్‌కు రూ.2,500 విలువగల బియ్యం, నిత్యావసర సరుకులను మంగళవారం అందజేసింది. ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్, మనోచేతన నిర్వాహకురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

◆ ల్యాప్‌టాప్‌ల అందజేత

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు కాగ్నిజెంట్ సంస్థ అందించిన ల్యాప్‌టాప్‌లను మంగళవారం జిల్లా సెక్టోరియల్ అధికారి భేతి భాస్కర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభావంతులకు కొదవలేదని, అలాంటి వారిని గుర్తించి తగు శిక్షణ అందిస్తే మరింత ప్రతిభావంతులుగా ఎదుగుతారన్నారు. ఎంపికై న వారికి ల్యాప్‌టాప్‌లు అందించి ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తూ ఐఐటీ జేఈఈ వంటి ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కిష్టయ్య, హెచ్‌ఎం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎం సహాయనిధి పేదలకు వరం

ములుగు(గజ్వేల్): సీఎం సహాయనిధి పథకం పేదలకు వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మండలంలోని మామిడ్యాల ఆర్ అండ్‌ఆర్ కాలనీకి చెందిన జీడికంటి చంద్రయ్యకు మంజూరైన రూ.22,500 సహాయ నిధి చెక్కును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

◆ హనుమాన్ జయంతి వరకు అన్నదానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ మాలధారణ స్వాములకు అక్షయ తృతీయ నుంచి హనుమాన్ జయంతి వరకు భిక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు రమణాచార్యులు తెలిపారు. ఆలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమాన్ మాలధారణ స్వాములకు 2009 నుంచి ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా బుధవారం ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యనారాయణ, సీవీఎస్ నారాయణ, మధుసూదన్, శేషుకుమార్, చంద్రమౌళి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

◆ అర్ధమండల దీక్షకు దుర్గాప్రసాద్ స్వామి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక సంతోషిమాత ఆలయ ప్రాంగణంలో అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం అభయాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించనున్న అర్ధమండల దీక్ష కార్యక్రమంలో హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామి హాజరుకానున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో స్వాములకు మాలధారణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, పరమేశ్వర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

◆ నిబంధనలు తప్పనిసరి: ఎస్‌ఐ రాజు

కొమురవెల్లి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ రాజు పిలుపు నిచ్చారు. సోమవారం రాత్రి మండలంలోని అయినాపూర్‌లో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. మూఢ నమ్మకాలు, చేతబడులు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తుపదార్థాల వల్ల కలిగే అనార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.